యూటీఎఫ్ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ



డైరీ, క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న ఎంఈఓలు

గుంతకల్లుటౌన్: ఐక్య ఉపాధ్యాయ సంఘం(యూటీఎఫ్) ముద్రించిన నూతన ఆంగ్ల సంవత్సర క్యాలెండర్, డైరీలతో పాటు అధ్యాపక దర్శినులను మండల విద్యాధికారులు మస్తాన్‌రావు, సుబ్బరాయుడు ఆవిష్కరించారు. ఆదివారం స్థానిక సరోజినినాయుడు మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ యూటీఎఫ్ పని పద్ధతులు, అధ్యయనం, భోధనలు, సామాజిక స్పృహ అనే నినాదాలతో ఉపాధ్యాయ సమస్యలపై ఎల్లప్పుడూ కృషి చేస్తుంటుందన్నారు. ఉపాధ్యాయ పక్షపాతిగానే కాకుండా విద్యార్థులకు మోడల్ టెస్టులు, స్టడీ మెటీరియల్ పంపిణీ తదితర కార్యక్రమాలు చేపడుతోందన్నారు. యూటీఎఫ్ జిల్లా కోశాధికారి రాఘవేంద్ర, గౌరవాధ్యక్షుడు మల్లికార్జున, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు రామకృష్ణ, రాజ్‌కుమార్, నాయకులు రమేష్, ఎల్లన్న, శంకరయ్య, సిద్దయ్య తదితరులు పాల్గొన్నారు.













నూతన సంవత్సర శుభాకాంక్షలు



ఎమ్మెల్యేలు జొన్నలగడ్డ పద్మావతి, కేతిరెడ్డి పెద్దారెడ్డి, వై.వెంకటరామిరెడ్డి

శింగనమల: నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి నూతన సంవత్సర శుభాకాంక్షలను తెలిపారు. ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని కోరారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలపడానికీ వచ్చే వారు పూలు, బొకేలు, స్వీట్లు బదులు పర్యావరణానికి మేలు కలిగించే రావి, జువ్వి, మేడి తదితర మొక్కలను తీసుకురావాలని సూచించారు.

తాడిపత్రి అర్బన్: నియోజకవర్గ ప్రజలందరికీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. 2024 తెలుగు ప్రజలకు ఆనందాల సంవత్సరం కావాలని, ప్రతి ఇంటా నూతన సంవత్సరంలో సుఖ సంతోషాలు వెల్లివిరియాలని, సంపద సమృద్ధి కలగాలని ఎమ్మెల్యే పెద్దారెడ్డి ఆకాంక్షించారు. నూతన సంవత్సరం నియోజకవర్గ ప్రజల జీవితాల్లో మంచి మార్పులు తీసుకురావాలని కోరుతూ ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఇదిలా ఉండగా నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకుని సోమవారం ఉదయం నుంచి స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలోఎమ్మెల్యే పెద్దారెడ్డి ప్రజలకు అందుబాటులో ఉండనున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపాయి.

గుంతకల్లుటౌన్: గుంతకల్లు నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి నూతన ఆంగ్ల సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. 2024లో సరికొత్త ఆశలు, లక్ష్యాలతో ప్రజలు మరింత సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆ దేవుణ్ణి ప్రార్థిస్తున్నానని ఆయన పేర్కొన్నారు. ఈ ఏడాదిలో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి మీ చల్లని దీవెనలందించి మరోసారి జగనన్న నేతృత్వంలోని ప్రజా సంక్షేమ ప్రభుత్వ ఏర్పాటుకు సహకారమందించాలని ఆయన కోరారు.

ఇంటింటికీ అయోధ్య అక్షింతలు అందిద్దాం



సమావేశంలో పాల్గొన్న ఆత్మారామాలయం కమిటీ సభ్యులు

శింగనమల: మండలంలోని ప్రతి ఇంటికీ అయోధ్య రామాలయం అక్షింతలను అందిద్దామని శింగనమల ఆత్మారామాలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆదివారం రామాలయంలో అయోధ్య అక్షింతలు, రామమందిర చిత్ర పటాల పంపిణీపై సమావేశం నిర్వహించారు. ఆత్మారామాలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఇప్పటికే మండలంలోని ప్రతి గ్రామానికి అయోధ్య అక్షింతలు చేరవేశామన్నారు. అయోధ్య రామాలయం ప్రారంభ వేడుకలు ప్రారంభం కాగానే, ప్రతి ఇంటికీ అక్షింతలు చేరే వేసేలా ప్రణాళికను తయారు చేసుకుందామన్నారు. ఆదేవిధంగా రామాలయం చిత్ర పటాన్ని ఇంటింటికీ చేరేలా చూడాలని నిర్ణయించుకున్నారు. సమావేశంలో ఆత్మారామాలయ కమిటీ సభ్యులు జేవీ సురేష్, విజయశంకర్‌రెడ్డి, లక్ష్మణస్వామి, జగదీష్, రాంభూపాల్‌రెడ్డి, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి గాలికుంటు నివారణ టీకాలు

శింగనమల: శింగనమల, గార్లదిన్నె మండలాల్లో మంగళవారం నుంచి పశువులకు గాలికుంటు టీకాలు ఉచితం వేయనున్నట్లుని శింగనమల పశువైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్. పద్మనాభం తెలిపారు. నాలుగు నెలల వయసున్న దూడల నుంచి అన్ని పశువులకు టీకాలు వేస్తామన్నారు.

ఓపెన్ చెస్ టోర్నీలో చిన్నారుల ప్రతిభ



విజేతలకు బహుమతులు అందజేస్తున్న నాగార్జున

గుంతకల్లుటౌన్: అనంతపురం జిల్లా చెస్ అసోసియేషన్, గుంతకల్లు పెంగ్విన్ ఆక్టివిటీ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక మండీబజార్‌లోని క్లబ్‌లో ఆదివారం జిల్లా ఓపెన్ చెస్ టోర్నమెంట్‌ను నిర్వహించారు. ఇందులో జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన 43 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. వీరిలో ఎం. జాహ్నవి, కె.బాలాజీ, జి.ఆర్యన్ నరేష్, డి.హిమోష్ర, కె.ప్రహర్షిత్ విజేతలుగా నిలిచినట్లు సీనియర్ నేషనల్ ఆర్బిటర్ నాగార్జున కర్ణాటకమ్ తెలిపారు. గెలుపొందిన విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలను అందజేశారు. జనవరి 28న వైఎస్సార్ కడపలో జరిగే ఏపీ స్టేట్ ఓపెన్ చెస్ టోర్నమెంట్‌కు ఈ ఐదుగురు క్రీడాకారులు ఎంపికైనట్లు ఆయన పేర్కొన్నారు. అంతర్జాతీయ రేటెడ్ క్రీడాకారులు అనిల్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఒకే ధరకు చికెన్ విక్రయించాలి



చికెన్ సెంటర్ నిర్వాహకులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ గురుప్రసాద్‌రెడ్డి

యాడికి: కొత్త సంవత్సరాన్ని పురస్కరించుకొని చికెన్ సెంటర్ నిర్వాహకులు అందరూ ఒకే ధరకు చికెన్ విక్రయించాలని ఎస్‌ఐ గురుప్రసాద్‌రెడ్డి చికెన్ సెంటర్ నిర్వాహకులను సూచించారు. ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐ మండలంలోని చికెన్ సెంటర్ నిర్వాహకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ తక్కువ కోళ్లతో ఉన్న ఓ చికెన్ సెంటర్ నిర్వాహకుడు అతి స్వల్ప రేటుతో చికెన్ విక్రయిస్తున్నాడని, దీంతో మిగిలిన దుకాణాల యజమానులు వ్యాపారాలు జరగక ఇబ్బందులు పడుతుండటంతో మండలంలోని దుకాణాల యజమానులందరూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో చికెన్ అమ్మే వాళ్లంతా ఒకే ధరను నిర్ణయించుకొని విక్రయించాలన్నారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

గుత్తి రూరల్: మండలంలోని మాముడూరులో ఓ యువకుడు ఆదివారం ఆత్మహత్యకు యత్నించాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన శివప్రసాద్ కొన్ని రోజులుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతుండేవాడు. ఈ క్రమంలో తీవ్ర మనస్తాపానికి గురైన అతడు ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగాడు. అపస్మారక స్థితిలో పడి ఉన్న అతడిని కుటుంబసభ్యులు వెంటనే చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు అనంతపురం తీసుకెళ్లారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.







గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర

పెద్దవడుగూరు: మేడిమాకులపల్లి, చింతలచెర్వు గ్రామాల్లో ఆదివారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర సాగింది. ఈ సందర్భంగా అధికారులు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ప్రతి ఒక్కరూ కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ కుల్లాయిస్వామి సూచించారు. అనంతరం సంచార రథంలో వీడియో ద్వారా పథకాలను ప్రదర్శించారు. మండల స్థాయి అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా సంవత్సరాంత ఆరాధన



మాట్లాడుతున్న రెవరెండ్ విశ్వమోహన్

పామిడి: స్థానిక సీఎస్‌ఐ చర్చిలో సంవత్సరాంత ఆదివార ఆరాధనను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పాస్టర్ రెవరెండ్ బీ విశ్వమోహన్ మాట్లాడుతూ. దేవుని కృప, కాపుదల, భద్రత, రక్షణే మనలను ఈ సంవత్సరాంతం వరకూ కాచీ కాపాడారన్నారు. తద్వారా దేవునికి మన కృతజ్ఞతా స్తుతి, కృతజ్ఞతార్పణలు చెల్లించేవారమై ఉండాలన్నారు. చర్చి సెక్రటరీ పరదేశి విజయశేఖర్‌రాజు, సభ్యులు, వీరయ్య, అబ్రహాం, జయరాజు, రవిరాజు, బుజ్జిబాబు, ప్రసాద్, రజని, చంద్రకళ, పాస్టరమ్మ సువర్ణ, వాణి తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

గార్లదిన్నె: కోటంకలో ఆదివారం ఓ వ్యక్తి డీజీ మాత్రలు మింగి ఆత్మహత్యకు యత్నించాడు. 108 సిబ్బంది తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన సూర్య అనే వ్యక్తి ఇంట్లో ఎవరూ లేని సమయంలో డీజీ మాత్రలు మింగాడు. అపస్మారక స్థితిలో పడి పండగా కుటుంబ సభ్యులు గమనించి 108లో అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అయితే ఆత్మహత్యాయత్నానికి కారణాలు తెలియాల్సి ఉంది.





















కనకదాస జయంతి

కుందుర్పి: ఎర్రగుంట గ్రామంలో ఆదివారం భక్త కనకదాస జయంతిని కురుబ కులస్తులు ఘనంగా నిర్వహించారు. కనకదాస చిత్రపటాన్ని ట్రాక్టర్‌లో అలంకరించి బోనాలతో ఊరేగించారు. అనంతరం కనకదాస జీవిత చరిత్ర, కురుబల హక్కుల సాధనకు చేపట్టాల్సిన చర్యలపై ఆ సంఘం నాయకులు వివరించారు. అల్లాపురం, ఎర్రగుంట గ్రామాలకు చెందిన కురుబ కులస్తులు పాల్గొన్నారు.











దర్గాలో ఎమ్మెల్యే ప్రత్యేక ప్రార్థనలు



పూల చాదర్ సమర్పిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

తాడిపత్రి అర్బన్: పట్టణంలోని ఆంధ్రా బ్యాంకు వెనుక ఉన్న హజరత్ యాసిన్ వలి దర్గాలో ఆదివారం రాత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. దర్గా నిర్వాహకులు ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డికి ఘనస్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే పెద్దారెడ్డి దర్గాలో పూల చాదర్ సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈసందర్భంగా దర్గా పీఠాధిపతులు ఎమ్మెల్యే పెద్దారెడ్డిని ఆశీర్వదించారు.

జెడ్పీటీసీ సభ్యుడికి పరామర్శ

పెద్దవడుగూరు: మండల జెడ్పీటీసీ భాస్కర్‌రెడ్డి ఇటీవల ప్రమాదవ శాత్తు కిందపడి కాలు విరగడంతో శస్త్ర చికిత్స చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నాడు. సమాచారం అందుకున్న అనంతపురం జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ దంపతులు ఆదివారం పెద్దవడుగూరు వెళ్లి భాస్కర్ రెడ్డిని పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.



భాస్కర్‌రెడ్డిని పరామర్శిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ

రానున్నది జగనన్న ప్రభుత్వమే

తాడిపత్రి అర్బన్: వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయ ఢంకా మోగిస్తుందని, రానున్నది జగనన్న ప్రభుత్వమేనని ఆ పార్టీ నేత, జెడ్పీ మాజీ ఫ్లోర్ లీడర్ వెన్నపూస రవీంద్రారెడ్డి అన్నారు. ఆదివారం పట్టణానికి వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడారు. గత ఎన్నికల సమయంలో ఉద్యోగులకు, కార్మికులకు ఇవ్వని హామీలను కూడా అమలు చేసిన ఘనత సీఎం వైఎస్.జగన్‌దన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో టీడీపీ వలలో పడొద్దని ఆయన ఉద్యోగులు, కార్మికులకు సూచించారు. అంగన్‌వాడీలకు గణనీయమైన జీతాలు పెంచింది జగనన్న కాదా అని ప్రశ్నించారు. అలాగే సర్వశిక్ష అభియాన్ ఉద్యోగులు, మున్సిపల్‌కార్మికులు చర్చల ద్వారా తమ సమస్యలను పరిష్కరించుకోవాలని, ఇది ఉద్యోగుల పక్షపాత ప్రభుత్వమన్నారు.



మాట్లాడుతున్న వెన్నపూస రవీంద్రారెడ్డి

బలిజ సంఘం అధ్యక్షుడికి సన్మానం

గుత్తి: పట్టణంలోని ఎంఎస్ ఫుట్ బాల్ క్రీడామైదానం వద్ద ఆదివారం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బలిజ సంఘం గుత్తి మండల అధ్యక్షుడిగా ఇటీవల ఎంపికైన బండి సత్యనారాయణను ఘనంగా సన్మానించారు. వాకర్స్ అసోసియేషన్ నాయకులు శివ శంకర్, సిల్లమల శ్రీనివాసులు, శ్రీధర్ గౌడ్,కరెంట్ శ్రీనివాసులు, డేనియల్, రవి, ఖాజా బాషా, రవి చంద్ర, శివ కుమార్ తదితరులు బండి సత్యనారాయణను శాలువాలు, పూలమాలలతో సత్కరించారు.



సత్యనారాయణను సన్మానిస్తున్న దృశ్యం

నేడు రామకృష్ణుల కల్పతరు దినోత్సవం

అనంతపురం కల్చరల్: స్థానిక హెచ్చెల్సీ కాలనీలోని శ్రీ రామకృష్ణ సేవా సమితి ప్రాంగణంలో ఏటా మొదటిరోజున కల్పతరు దినోత్సవం సోమవారం ఉదయం 8.30 గంటలకు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు శ్రీధరమూర్తి ఓ ప్రకటనలో తెలిపారు.

సంతల ఆదాయం రూ.3.89 లక్షలు

అనంతపురం అగ్రికల్చర్: స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డు ప్రాంగణంలో ఈ వారం జరిగిన పశువులు, జీవాల సంతల ద్వారా రూ.3.89 లక్షలకుపైగా ఆదాయం వచ్చినట్లు చైర్మన్ ఫయాజ్ బాషా, సెక్రటరీ ఆర్.జయలక్ష్మి తెలిపారు. అందులో శనివారం జరిగిన గొర్రెలు, మేకల సంత నుంచి రూ.2,24,360 వసూలయ్యిందన్నారు. ఆదివారం జరిగిన పశువుల సంత నుంచి రూ.1.65,400 మేర వసూలైనట్లు తెలిపారు.

పేకాట కేంద్రంపై దాడి

అనంతపురం క్రైం: టూటౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని నాయక్ నగర్‌లో ఓ ఇంట్లో రహస్యంగా పేకాట నిర్వహిస్తుండడంతో పోలీసులు ఆదివారం దాడి చేశారు. ఈ దాడిలో ఐదుగురు పేకాట రాయుళ్లను అరెస్ట్ చేసి, వారి నుంచి రూ. 33 వేలు నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ శివరాముడు తెలిపారు.

జూనియర్ అథ్లెటిక్స్ మీట్‌కు ఎంపిక



పరుగు పందెంలో పాల్గొన్న క్రీడాకారులు

అనంతపురం: నగరంలోని నీలం సంజీవరెడ్డి స్టేడియంలో అండర్-14, అండర్-16 జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఆదివారం నిర్వహించారు. 200 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఇందులో ఎంపికైన వారు ఫిబ్రవరి 16,18 తేదీల్లో గుజరాత్‌లో జరగబోవు పోటీల్లో పాల్గొంటారని, అథ్లెటిక్స్ అసోసియేషన్ అడ్‌హాక్ కమిటీ జిల్లా చైర్మన్ డి. ఇస్మాయిల్, కన్వీనర్ డి.రవికుమార్ పేర్కొన్నారు.

క్లుప్తంగా

సమయపాలన పాటించండి



మస్టర్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ మల్లికార్జున

గుంతకల్లుటౌన్: మున్సిపల్ శానిటేషన్ అధికారులు, సిబ్బంది, కార్మికులు విధి నిర్వహణలో సమయపాలన పాటించాలని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున తెలిపారు. ఆదివారం ఉదయం పట్టణంలోని 2వ డివిజన్ పీహెచ్ వర్కర్స్ మస్టర్‌ను ఆయన పరిశీలించారు. ఔట్‌సోర్సింగ్ పీహెచ్ వర్కర్ల సమ్మె నేపథ్యంలో రెగ్యులర్ వర్కర్ల చేత ప్రధాన రహదారులు, వీధుల్లో పారిశుధ్య పనులు చేయించాలన్నారు. ఇంటింటా చెత్తసేకరణ సక్రమంగా జరిగేలా చూడాలని అధికారులకు సూచించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్, శానిటేషన్ కార్యదర్శులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక చర్యలు



శంకుస్థాపన చేస్తున్న ముసలన్న

బుక్కరాయసముద్రం: గోవిందపల్లి గ్రామ పంచాయతీలోని భద్రంపల్లిలో తాగునీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు సర్పంచ్ రాములమ్మ, మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ ముసలన్న పేర్కొన్నారు. భద్రంపల్లిలో ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ఏపీ ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరి సాంబశివారెడ్డి చొరవతో వాటర్ ట్యాంక్ నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయన్నారు. ఆదివారం వారు ట్యాంకు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. త్వరగా ట్యాంకు నిర్మాణం పూర్తి చేయించి తాగునీరు సరఫరా చేస్తామని వారు పేర్కొన్నారు.

కోటంక సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు



అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

గార్లదిన్నె: కోటంక కొండల్లో వెలసిన సుబ్రహ్మణ్యేశ్వర ఆలయంలో ఆదివారం ప్రధాన అర్చకులు రామాచార్యులు సుబ్రహ్మణ్యస్వామిని అలంకరించి విశేష పూజలు నిర్వహించాచా. చుట్టు పక్కల గ్రామాల నుంచి మహిళలు, భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అన్నదానం చేశారు.

బేకరీల్లో తనిఖీలు

అనంతపురం క్రైం: నగరంలోని బేకరీలు, స్వీట్స్ దుకాణాలను లీగల్ మెట్రాలజీ అధికారులు ఆదివారం తనిఖీ చేశారు. ప్యాకేజీ తినుబండారాలపై తయారీదారుడి పూర్తి చిరునామా, తయారైన నెల, సంవత్సరం, వినియోగదారుడు ఫిర్యాదు చేయాల్సిన పేరు,చిరునామా, ఫోన్ నంబర్ తదితర వివరాలు ముద్రించకపోవడంతో జరిమానా విధించారు. అధిక ధరలకు కూల్ డ్రింక్ అమ్ముతున్నందుకు, కేక్‌లు తక్కువ తూకం ఉండడంతో మొత్తం 11 కేసులు నమోదు చేసి, 7 కేసులకుగాను రూ. 60 వేలు జరిమానా విధించారు. తనిఖీలో లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ మహమ్మద్ గౌస్, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా హజరత్ ఇమామ్‌షావలి ఉరుసు



విద్యుత్‌కాంతులతో హజరత్ ఇమామ్‌షావలి దర్గా



హజరత్ ఇమామ్‌షావలి సమాధి

కణేకల్లు: మండలంలోని మాల్యం గ్రామంలో హజరత్ ఇమామ్‌షావలి ఉరుసు ఆదివారం రాత్రి ఘనంగా నిఋర్వహించారు. కులమతాలకు అతీతంగా జరుపుకునే ఉరుసుకు వేలాది మంది భక్తులు తరలిరావడంతో దర్గా ప్రాంగణమంతా కిక్కిరిసిపోయింది. పలువురు భక్తులు తమ ఆరాధ్యదైవమైన హజరత్ ఇమామ్‌షావలికి చక్కెరను తులాభారమివ్వగా.. మరికొందరు పూలచద్దర్‌ను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. నిర్వాహకులు అనంతపురం యూనుస్, మాబుపీరా, గంగలాపురం ఫక్ృద్దీన్, ఆదం సోదరులు దర్గాలో హజరత్ ఇమామ్‌షావలి సమాధిపై నూతన వస్త్రాలు, పూలచద్దర్‌లు సమర్పించి ప్రత్యేక ఫాతేహాలు చేయించారు. రాత్రి నిర్వహించిన ఖవ్వాలి కార్యక్రమం భక్తులకు ఆకట్టుకుంది.



చిన్నారికి తులాభారం చేస్తున్న తల్లిదండ్రులు



దర్గాలో ఫాతేహాలు చేయిస్తున్న భక్తులు

క్లుప్తంగా

తాగునీరు సరఫరా



ట్యాంకర్ ద్వారా నీరు అందిస్తున్న దృశ్యం

తాడిపత్రి అర్బన్: మున్సిపల్ కార్మికుల సమ్మె నేపథ్యంలో పట్టణంలో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా అల్లారఖా వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో సొసైటీ అధ్యక్షుడు అయూబ్‌బాషా తన సొంత ఖర్చులతో ప్రజలకు తాగునీరు సరఫరా చేశారు. ఆదివారం పట్టణంలోని సంజీవనగర్, రాగితోపాటపాలె, బంకమడి వీదిలోని ప్రజలకు ట్యాంకర్ల ద్వారా తాగునీటిని అందించారు. ఎవరైనా తాగునీటికి ఇబ్బందులు కలిగితే 9849306229 నంబరులో సంప్రదించాలని అయూబ్‌బాషా తెలిపారు.

స్కేటింగ్ పోటీల్లో తాడిపత్రి విద్యార్థుల ప్రతిభ



రన్నరప్‌గా నిలిచిన చిన్నారులు

తాడిపత్రి అర్బన్: తిరుపతిలో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ స్కేటింగ్ పోటీల్లో తాడిపత్రి విద్యార్థులు ప్రతిభ చాటారు. గత నెల 29,30 తేదీల్లో తిరుపతిలో జరిగిన రోల్‌బాల్ స్కేటింగ్, స్టేట్ లెవెల్ చాంపియన్‌షిప్ బాలుర అండర్-14 విభాగంలో పట్టణానికి చెందిన టాలెంట్ స్కేటింగ్ అకాడమీకి చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. ఈపోటీల్లో ప్రతిభ కనబరిచి రన్నరప్‌గా నిలిచారు. విజేతలను వారి తల్లిదండ్రులు, కోచ్ మధు అభినందించారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

పెద్దవడుగూరు: స్థానిక ఐఎస్ఈసీ చర్చిలో ఆదివారం ఫాస్టర్ జాన్‌డేవిడ్ ఆధ్వర్యంలో సంఘం సభ్యులు నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు కొత్త సంవత్సరంలో ప్రజలందరూ బాగుండాలని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సంఘం సభ్యులు మేరీ ఆరోగ్యమ్మ, ఆనంద్, ఇమ్మానియల్, ఎస్తేర్‌రాణి, శోభారాణి, ఓబుళమ్మ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలికి గాయాలు

కళ్యాణదుర్గం రూరల్: మండలంలోని కుర్లపల్లి సమీపంలో ఆదివారం ద్విచక్ర వాహనం అదుపు తప్పి వృద్ధురాలు మారెక్క తీవ్రంగా గాయపడింది. వివరాలు.. నారాయణపురం గ్రామానికి చెందిన మారెక్క ఆదివారం కుర్లపల్లిలో జరిగిన వివాహ వేడుకకు హాజరై మనవడితో కలసి ద్విచక్రవాహనంలో బయలుదేరింది. కుర్లపల్లి గేట్ వద్ద కుక్క అడ్డం రావటంతో ద్విచక్రవాహనం అదుపు తప్పి కిందపడ్డారు. తీవ్రంగా గాయపడ్డ మారెక్కను స్థానికులు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స నిమిత్తం అనంతపురం ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వీరశైవ ఉద్యోగుల క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

అనంతపురం సెంట్రల్: ది వీరశైవ ఎంప్లాయీస్ అసోసియేషన్ నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఆదివారం పాతూరు బసవన్నకట్ట గుడిలో ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వీరశైవ విశిష్ట అతిథులుగా జయంత్, వీరశైవ సమాజ అధ్యక్షులు రాజు, జంగమ సంఘ అధ్యక్షులు తిప్పేస్వామి, ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు రవిశంకర్, ప్రధాన కార్యదర్శి ఉమాశంకర్, నాయకులు శాంతకుమార్, ప్రసన్నకుమార్, శివకుమార్, భారతి, కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

నూర్‌బాషా సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా ఖాసీం



నూతన అధ్యక్షుడిని అభినందిస్తున్న దృశ్యం

అనంతపురం సెంట్రల్: దూదేకుల, నూర్‌బాషా సంక్షేమ సంఘం అధ్యక్షుడు అక్కంపల్లి ఖాసీంను ఎన్నుకున్నారు. ఆదివారం సంఘం గౌరవాధ్యక్షురాలు రమీజాబేగం నివాసంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి మహబూబ్ సాహెబ్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు

అనాథాశ్రమానికి బియ్యం అందజేత



బియ్యం అందిస్తున్న సీఐ రాజశేఖర్‌రెడ్డి

గుత్తి: పట్టణంలోని కొత్తూరులో ఉన్న అనాథాశ్రమానికి పామిడి సీఐ రాజశేఖర్‌రెడ్డి ఆదివారం ఐదు క్వింటాళ్ల బియ్యం అందజేశారు. ఆశ్రమ నిర్వాహకులు జగన్నాథం, సునీత దంపతులకు బియ్యం బస్తాలను అందించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ భవిష్యత్తులో ఎలాంటి సహాయ సహకారాలు అవసరమున్నా తనకు సమాచారం ఇవ్వాలన్నారు. వైఎస్సార్ సీపీ సీనియర్ నేత రామసుబ్బారెడ్డి అలియాస్ హరి జిరాక్స్ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎస్ఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవం



గుత్తిలో జెండా ఆవిష్కరిస్తున్న దృశ్యం

గుత్తి: పట్టణంలోని ఎస్సీ బాలికల హాస్టల్లో ఆదివారం ఎస్ఎఫ్ఐ 54వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు రమేష్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ ఎస్ఎఫ్ఐ విద్యారంగ సమస్యలు, విద్యార్థుల సమస్యలు పరిష్కారం కోసం అనేక ఉద్యమాలు చేపట్టిందన్నారు. హాస్టల్ వార్డెన్ చంద్రకళ, ఎస్ఎఫ్ఐ నాయకులు దర్శన్, రాజేష్, పవన్ గౌడ్, అఖిల్, నందిని బాయ్, లక్ష్మి, శిరీష తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా న్యూ ఇయర్ వేడుకలు



ఎస్ఆర్ఐటీలో కేక్ కట్ చేస్తున్న సిబ్బంది

బుక్కరాయసముద్రం: మండలంలో ప్రజలు నూతన సంవత్సరం వేడుకలు ఉత్సాహంగా నిర్వహించారు. రోటరీపురంలోని ఎస్ఆర్ఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో కళాశాల యాజమాన్య కేక్ కట్ చేసి నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు. రోటరీపురంలోని జీవని స్వచ్ఛంద సంస్థలో నూతన సంవత్సరం వేడుకలు నిర్వహించారు.

కాలసర్ప దోష నివారణ పూజలు



ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరుడు

ఆత్మకూరు: పంపనూరు సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం రాహుకేతు హోమాలతో పాటు కాలసర్ప దోష నివారణ పూజలు నిర్వహించారు. స్వామి మూలవిరాట్‌కు పంచామృతాభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. స్వామి బంగారు కవచాన్ని ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేయించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించి మంగళహారతి ఇచ్చారు. మంజునాథ స్వామి, పార్వతీదేవికి ప్రత్యేక పూజలు అందించారు.

ఉత్తర గాలిగోపురానికి ముఖ ద్వారం ఏర్పాటు



ముఖ ద్వారం ఏర్పాటు చేసిన దృశ్యం

కూడేరు: మండల కేంద్రంలో ప్రఖ్యాతిగాంచిన శివపార్వతుల జోడు లింగాల సంగమేశ్వర స్వామి పుణ్య క్షేత్రానికి బళ్లారికి చెందిన భక్తుడు బసన్న గౌడ్ సుమారు రూ.80 లక్షలతో ఉత్తర, దక్షిణ గాలిగోపురాలను నిర్మిస్తున్నారు. ఆదివారం ఉత్తర గాలి గోపురానికి ముఖ ద్వారాన్ని ఏర్పాటు చేశారు. గోపురాల నిర్మాణపు పనులు చురుగ్గా సాగుతున్నాయి. త్వరగా గోపురాల నిర్మాణపు పనులు పూర్తి చేసి జోడు లింగాల ఆలయానికి నూతన శోభను తీసుకురావాలన్నదే తన కోరిక అని నిర్మాణ కర్త బసన్న గౌడ్ తెలిపారు. నిర్మాణపు పనులు సజావుగా సాగేందుకు ఆలయ కమిటీ సభ్యులు, ఎండోమెంట్ అధికారులు, భక్తులు సహాయ సహకారాలు అందించాలని ఆయన కోరారు.

వ్యక్తిపై కత్తితో దాడి



తీవ్రంగా గాయపడిన వెంకటరమణ

తాడిపత్రి: పట్టణంలోని శివాలయం వీధిలో నివాసముంటున్న వెంకటరమణ అనే వ్యక్తిని అప్పు తీర్చలేదని రమేష్ అనే వ్యక్తి కత్తితో పొడిచాడు. స్థానికులు తెలిపిన వివరాలు.. వెంకటరమణ బండల పాలీష్ పని చేస్తుండేవాడు. రమేష్ వద్ద వెంకటరమణ ఇది వరకు రూ.5 వేలు అప్పు తీసుకున్నాడు. అయితే వడ్డీ, అసలు చెల్లించకపోవడంతో ఆదివారం రాత్రి వెంకటరమణ ఇంటి వద్దకు రమేష్ వెళ్లి డబ్బు చెల్లించాలని బెదిరించాడు. ఇదే సమయంలో వారిద్దరూ గొడవపడగా రమేష్ తన వెంట తెచ్చుకున్న కత్తితో వెంకటరమణను పొడిచాడు. గతంలో వెంకటరమణ రమేష్‌పై దాడి చేసిన సంఘటనపై అప్పట్లో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పాతకక్షను మనస్సులో పెట్టుకోవడంతోపాటు బాకీ డబ్బు చెల్లించలేదన్న కారణంతో నిందితుడు ఈ దాడికి పాల్పడ్డాడు. తీవ్రంగా గాయపడిన వెంకటరమణను కుటుంబ సభ్యులు స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. తర్వాత వైద్యుల సూచనల మేరకు అనంతపురం తీసుకెళ్లారు. పట్టణ పోలీసులు ఘటనపై కేసు నమోదు చేశారు.

ప్రశాంతంగా నూతన సంవత్సర వేడుకలు జరుపుకోండి



మాట్లాడుతున్న సీఐ వెంకటరామిరెడ్డి

గుత్తి: నూతన సంవత్సరం(2024) వేడుకలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని గుత్తి సీఐ వెంకటరామిరెడ్డి ప్రజలకు సూచించారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. న్యూ ఇయర్ వేడుకల సందర్భంగా అల్లర్లకు పాల్పడినా, సైలెన్సర్లు తీసి బైక్‌లు డ్రైవ్ చేసినా, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించినా చట్ట ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇళ్లల్లో వేడుకలు నిర్వహించుకోవాలన్నారు. అకారణంగా రోడ్లపైకి వచ్చి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించడం, జనాలకు ఇబ్బందులు కలగజేయడం చట్ట వ్యతిరేకమన్నారు.

యల్లనూరు: మండలవ్యాప్తంగా సోమవారం నూతన సంవత్సర వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్ఐ ధరణీబాబు కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడుపరాదన్నారు. పోలీసుల నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

గార్లదిన్నె: మద్యం సేవించి సెల్‌ఫోన్లో మాట్లాడుతూ వాహనాలు నడపరాదని ఎస్ఐ సాగర్ పేర్కొన్నారు. ఆదివారం నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా ఎస్ఐ గ్రామాల్లో పర్యటించి శాంతి భద్రతలకు విఘాతం కలుగకుండా న్యూ ఇయర్ వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలని ప్రజలకు తెలియజేశారు. బహిరంగ ప్రదేశాలు, రోడ్ల మీద న్యూఇయర్ వేడుకలు చేయరాదన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



సంగీత కచేరి నిర్వహిస్తున్న పూర్వ విద్యార్థులు



అంతర్‌ధ్వని నాటికలోని సన్నివేశం

ప్రశాంతి నిలయం: సత్యసాయి మహాసమాధి చెంత ఆదివారం ఉదయం శ్రీసత్యసాయి హయ్యర్ సెకండరీ పాఠశాల పూర్వ విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. సత్యసాయిని కీర్తిస్తూ చక్కటి గాత్రంతో కచేరీ నిర్వహించారు. సాయంత్రం 'అంతర్ ధ్వని – ది ఇన్నర్ కాలింగ్' పేరుతో సందేశాత్మక నాటికను ప్రదర్శించారు. మానవాళిని సన్మార్గంలో పయనించేందుకు సత్యసాయి బోధించిన బోధనలను నాటిక రూపంలో చక్కగా ప్రదర్శించారు.

నేత్రపర్వంగా గ్రామోత్సవం



స్వామిని ఊరేగింపుగా తీసుకెళుతున్న భక్తులు

కుందుర్పి: మండలంలోని నిజవళ్లిలో చిత్రలింగేశ్వర స్వామి,ఈరన్న స్వామి గ్రామోత్సవం ఆదివారం నేత్రపర్వంగా సాగింది. సోమవారం బెస్తరపల్లిలో బొమ్మలింగేశ్వరస్వామి ఉత్సవం నిర్వహించనున్న తరుణంలో యాదవులు నిజవళ్లి గ్రామం నుంచి 15 కిలోమీటర్ల దూరంలోని బొమ్మలింగేశ్వరస్వామి ఆలయం వరకూ గ్రామోత్సవంగా తీసుకెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వెంకటంపల్లి, నిజవళ్లి, జంబుగుంపల, బెస్తరపల్లి గ్రామాల నుంచి పెద్దసంఖ్యలో యాదవులు పాల్గొన్నారు.